ప్రజాశక్తి
శుక్రవారం 17 మార్చి 2023
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మండలి ఓట్ల లెక్కింపులో..

ఉత్కంఠ

స్వర్ణభారతి స్టేడియంలోని కౌంటింగ్ ప్రాంతం

తొలి రౌండ్ పూర్తయ్యేసరికి టిడిపికి ఆధిక్యం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ఎంవిపి.కాలనీ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. గురువారం విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టింది. ప్రారంభ కౌంటింగ్ సాయంత్రం 6 గంటల వరకూ జరిగింది. ఓట్లన్నిటినీ కట్టలు కట్టి వేసే ప్రక్రియ సుమారు సాయంత్రం వరకూ సాగింది. మొదటి రౌండ్ ఫలితం వెల్లడయ్యేసరికి టిడిపి 4048 ఓట్ల మేర వైసిపిపై ఆధిక్యతను కనబర్చింది. పిడిఎఫ్ మూడో స్థానంలో ఉంది. మొత్తంగా 28 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఒక రౌండ్‌లో 28 వేల ఓట్లను లెక్కిస్తారు. మొత్తంగా 2 లక్షల పైచిలుకు ఓట్లు పోలైన పంగతి తెలిసిందే. గురువారం రాత్రి 9 గంటల వరకూ తొలి రౌండ్ ఫలితాన్ని సైతం అధికారులు వెల్లడించలేదు. రెండో రౌండ్ 9 గంటలకు ప్రారంభం అయ్యింది. రాత్రి 11 గంటలు దాటే సరికి 2 రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. 3 రౌండ్లు లెక్కింపు పూర్తయ్యే సరికి రాత్రి ఒంటి గంట దాటే అవకాశం ఉంది. ప్రతి రౌండ్‌కూ 2 గంటలకు పైనే సమయం పడుతోంది.

స్టేడియం వెలుపల బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

రాత్రి 11 గంటల సమయానికి వెలువడిన సమాచారం మేరకు..

టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు 11828 ఓట్లతో ప్రథమ స్థానంలో నిలవగా వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ 7,780 ఓట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 4898 ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారు. మొదట రౌండ్ ఓట్ల లెక్కింపు శ్రీకాకుళం జిల్లాకు సంబంధించినదని, అక్కడ టిడిపికి కాస్త మెజారిటీ ఉంటుందని తొలినుంచీ భావిస్తున్న విషయం చర్చనీయాంశమైంది. అనకాపల్లి ప్రాంతంలో కూడా టిడిపికి ఓట్లు అధికంగా వచ్చే వీలుందన్నది మిగతా 2లో..

సాగునీటికి నిధుల కోత

- సుజల స్రవంతికి బడ్జెట్‌లో దక్కని ప్రాధాన్యత
- రూ. 141.79 కోట్లకు తగ్గింపు
- పెద్దేరు, రైవాడకు మొండిచేయి
- 'కోణాం'కు రూ.5.38 లక్షలే కేటాయింపు
- ఊసేలేని సుగర్ ఫ్యాక్టరీల ఆధునికీకరణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు మళ్లీ ప్రభుత్వం మొండిచేయిచూపింది. సాగునీటి వనరుల అభివృద్ధికి బడ్జెట్లో తగిన కేటాయింపులు లేవు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిజేసింది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల వృద్ధికి కనీస ప్రాధాన్యత ఇవ్వలేదు. బాబూజగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులకు నిధులు పెంచకపోగా 2023-24 బడ్జెట్లో కోత పెట్టింది. పెద్దేరు ప్రాజెక్టుకు రెండేళ్లుగా బడ్జెట్ కేటాయించలేదు. ఈ ఏడాది పెద్దేరు సహా రైవాడకు మొండిచేయి చూపింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి 2022-23 బడ్జెట్లో రూ.297.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.141.79 కోట్లకు తగ్గించింది. జిల్లాలో రూ.2022 కోట్లతో తొలిదశ పనులు పూర్తిచేసి 1.30 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలన్న ప్రాథమిక లక్ష్యానికి తూట్లు పొడిచేలా ప్రభుత్వ కేటాయింపులున్నాయి. సుజల స్రవంతి పూర్తయితే జిల్లాలో 3.25 లక్షల ఎకరాల మెట్ట భూములకు సాగునీరు మిగతా 2లో..

బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధిపై స్పష్టత లేదు. 'అభివృద్ధి ఫుల్.. నిధులు నిల్' అన్నట్టు కేటాయింపులు ఉన్నాయి. నవరత్నాల చుట్టూ బడ్జెట్ ప్రసంగం, కేటాయింపులు ఉన్నాయి తప్ప సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక ప్రగతి, రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై లేవు. ప్రధానమైన అభివృద్ధి అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, నీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం దారుణంగా కేటాయింపులు తగ్గించేసింది.

కె.లోకనాథం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

గెడ్డపై అక్రమ నిర్మాణం

వార్త 3లో..

రబీ సాగు ఆశాజనకం

వార్త 3లో..

'విశాఖ ఉక్కు' పోరాటం ఉధృతం

వార్త 4లో..

మైదానం ముస్తాబు

ఈ నెల 19న పిఎం.పాలెంలోని క్రికెట్ మైదానంలో భారత్, ఆసీస్ జట్ల మధ్య రెండో వన్డే మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే విశాఖలో సందడి వాతావరణం నెలకొంది. మ్యాచ్ సందర్భంగా మైదానాన్ని ఇప్పటికే యాజమాన్యం సుందరంగా తీర్చిదిద్దుతోంది. కుర్చీలకు, గోడలకు రంగులు అద్దుతోంది.

సిఎస్.రావు

పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న కుటుంబీకులు

ఎఎంసికి సిఎస్.రావు పార్థివదేహం అప్పగింత

పలువురు సంతాపం

వార్త 2లో..

apple i
CBSE School
apple i Invites you in shaping young minds and making geniuses of future
- We believe "Excellence emerges from happy work culture".
- Supportive management that encourages Teachers.
- Striving to Implement the pedagogy using technology for diverse student community.
- Unlock the potential of every student for holistic development.
- Professional and financial opportunities for teachers with vertical growth.

Join the dynamic teaching team of apple i to deepen your own learning and be a mentor of making the young minds as future leaders.
Openings for: Mother Teachers and Subject Teachers for NURSERY to Grade XII
Srinagar, Gajuwaka, Visakhapatnam-26.
Contact Ph: 81212 24477, 98481 12642

మొదటి పేజీ తరువాయి..

స్వర్ణభారతి స్టేడియం వద్దకు పాస్ లేకుండా వచ్చిన వైవి.సుబ్బారెడ్డి పిఎ లావణ్య

మండలి ఓట్ల లెక్కింపులో ఉత్కంఠ

తెలుస్తోంది. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఒకటో రౌండ్ ఓట్ల లెక్కింపు అనంతరం మీడియాతో మాట్లాడుతూ చివరకు విజయం తనదే.. అంటూ ధీమా వ్యక్తం చేశారు. ఇంకా 1.70 లక్షల ఓట్లకు పైగా లెక్కించాల్సి ఉందన్నారు.

అధికారుల ఆకస్మిక ప్రకటనల గందరగోళం

మొదట రౌండ్ కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వర్ణభారతి ఆడిటోరియంలో ఒక ప్రకటన చేస్తూ.. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థికి ఎదురుగా టిక్ మార్క్ పెట్టినా ఒకటి అని సూచించినా చెల్లుతుందని ప్రకటించారు. తొలుత ఈ అంశంపై క్లారిటీ ఇవ్వకుండా ఒక రౌండ్ పూర్తయ్యేసరికి ప్రకటించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

మీడియాపై ఆంక్షలు

కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) స్పష్టంగా మీడియా ప్రతినిధులకు పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు నేరుగా వెళ్లేందుకు పాస్‌లను మంజూరు చేసినా కౌంటింగ్ జరిగే స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోకి మీడియా వారిని అధికారులు అనుమతించలేదు. గతంలో మూడు దఫాలుగా మీడియా ప్రతినిధులను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించారు. 2023లో మీడియాపై ఆంక్షలు విధించడం, లోపలకి వెళ్లాలని ప్రయత్నించే వారితో పోలీసులకు ఘర్షణలకు దిగడం జరిగింది. స్వర్ణభారతి స్టేడియం మొదటి గేటు వరకే గురువారం మీడియాను అనుమతించారు. దీంతో సమాచారం కోసం మీడియా నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

సుబ్బారెడ్డి పిఎ హల్‌చల్

కౌంటింగ్ జరిగే ప్రాంతంలోకి పాస్ లేనిదే ఎవ్వరినీ అనుమతించని పోలీసులు టిడిడి ఛైర్మన్, వైసిపి ఉత్తరాంధ్ర కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి పిఎని అంటూ లావణ్య అనే మహిళ రాగా ఆమెను స్వర్ణభారతి స్టేడియం లోపలకు రానిచ్చారు. ఈ ఘటన పట్ల పలువురు విస్మయం వ్యక్తపరిచారు. అందరికీ ఒక'లా'.. ఈమెకు మరో'లా' ఏంటని పలువురు మండిపడ్డారు.

సాగునీటికి నిధుల కోత

లభించనుంది. కనీసం తొలిదశ పనులు పూర్తి చేసినా 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు ఆశపడ్డారు. ప్రభుత్వ కేటాయింపులు భూ సేకరణ చెల్లింపుల్లో ఏ మూలకూ సరిపోవు. 2021-22లో కేవలం రూ.79.95 కోట్లు కేటాయించి, రూ.2.61 కోట్లు విడుదల చేయడంతో పనులు జరగలేదు. నిధుల విడుదల్లో అదే పరిస్థితి కొనసాగడంతో సుజల స్రవంతి పనుల్లో ఆశించిన పురోగతి కన్పించడంలేదు.

తాండవకు 2021-22లో కోటి రూపాయలు కేటాయించిన ప్రభుత్వం, 2022-23లో రూ.88.93 లక్షలకు కుదించి, 2023-24 బడ్జెట్లో రూ.2.54 కోట్లకు పెంచింది. తాండవకు ఐదు కోట్లు అవసరమని నీటిపారుదల శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ బడ్జెట్లో రూ.2.54 కోట్లు కేటాయించింది. దాదాపు ఏ ప్రాజెక్టుకూ ప్రతిపాదనలకు తగినట్లు కేటాయింపులు చేయలేదు. కోణాంకు 2021-22లో పది లక్షలు కేటాయించిన ప్రభుత్వం, 2022-23లో రూ.40.10 లక్షలకు పెంచింది. ఈ ఏడాది రూ.5.38 లక్షలకే పరిమితం చేసింది. రైవాడకు 2021-22లో 11.46 లక్షలు, 2022-23లో రూ.2.26 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది పైసా కూడా లేదు. పెద్దేరుకు 2021-22లో రూ.10.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం 2022-23, 2023-24లో కేటాయించడం మానేసింది. గతేడాది పెద్దేరు జలాశయ కాలువ ఆధునికీకరణ పనులు, పూడికతీత, కొద్దిపాటి భూ సేకరణ చెల్లింపులకు రూ.9 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపినా స్పందించలేదు.

జిల్లాలోని క్రషింగ్ నిలిపివేసిన తుమ్మపాల, తాండవ, ఏటికొప్పాక సహకార చక్కెర ఫ్యాక్టరీలను ఆధునికీకరించి తెరిపించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదు.

ప్రాజెక్టు	కేటాయింపులు (కోట్లలో) 2022-23	2023-24
ఉత్తరాంధ్ర సుజల స్రవంతి	297.50	141.79
తాండవ	88.93 లక్షలు	2.54 కోట్లు
రైవాడ	2.26 కోట్లు	-
కోణాం	40.10 లక్షలు	5.38 లక్షలు
పెద్దేరు	-	-

ఎంసికి సిఎస్.రావు పార్థివదేహం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బుధవారం కన్నుమూసిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, ప్రజా స్పందన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సిఎస్.రావు (93) పార్థివ దేహాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల అనాటమీ విభాగానికి ఆయన కుటుంబీకులు గురువారం అందజేశారు. తొలుత ద్వారకా నగర్ ఐదో లైన్‌లో ఉన్న ఆయన ఇంటి వద్ద నుంచి ఆంధ్ర మెడికల్ కళాశాల వరకు అంతిమయాత్ర చేపట్టారు. సావిత్రిబాయి పూలే ట్రస్టు ద్వారా అవయవ దానం చేస్తానని గతంలో సిఎస్.రావు హామీ పత్రం ఇచ్చిన మేరకు పార్థివ దేహాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాలకు అతని ముగ్గురు కుమారులు దక్షిణామూర్తి, జోగారావు, విశ్వనాథరావు సహా ఇతర కుటుంబ సభ్యులు అప్పగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.బుచ్చిరాజు పార్థివ దేహాన్ని స్వీకరించారు. సిఎస్.రావు భార్య ఇంత క్రితమే మరణించగా, ముగ్గురు కుమారులు కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్నతోద్యోగులుగా పనిచేసి విరమణ పొందారు. ఒకరు గుర్గాన్‌లోనూ, మరొకరు విశాఖలోనూ, ఇంకొకరు హైదరాబాద్‌లోనూ నివసిస్తున్నారు.

పలువురి సంతాపం

సిఎస్.రావు మృతికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఛైర్మన్ ప్రొఫెసర్ కెవి.రమణ, ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. సిఎస్.రావు విశాఖ నగరంలో నివాసముంటూ ఉత్తరాంధ్ర సమస్యలపై తన గళాన్ని వినిపించారన్నారు. పబ్లిక్ లైబ్రరీ స్థలం అప్పగింత, పాత జైలు స్థలం ప్రజోపయోగానికి వినియోగించడం, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన చట్టం అమలు వంటి అనేక సమస్యలపై మిగిలిన సంఘాలతో కలిపి ఆయన అనేక కార్యక్రమాలలో క్రమం తప్పకుండా పాల్గొన్నారని గుర్తు చేశారు. దేశంలో ప్రభుత్వ రంగం బలంగా ఉండాలని కోరుకునేవారని తెలిపారు. ప్రత్యేకంగా ప్రజా స్పందన అనే సంస్థను ఏర్పాటు చేసి అన్ని సమస్యలపైనా స్పందించేవారన్నారు. తొంభై ఏళ్ల వయస్సులో కూడా అన్ని సమావేశాలకూ సమయానికి ముందే హాజరవుతూ నేటి తరానికి ఆదర్శంగా నిలిచారన్నారు.

సిఎస్.రావు మరణంతో విశాఖపట్నం ఒక సామాజిక పోరాట యోధున్ని కోల్పోయినట్లు అయిందని పీపుల్స్ ఫర్ ఇండియా ఛైర్మన్ ప్రొఫెసర్ కెవి.రమణ, కన్వీనర్ ఎం.కామేశ్వరి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు ఓ సంయుక్త ప్రకటనలో సంతాపం తెలిపారు.

సీతమ్మధార : సిఎస్.రావు మృతి విశాఖ అభివృద్ధికి తీరని లోటని మాజీ శాసన సభ్యులు, విశాఖపట్నం కో - ఆపరేటివ్ బ్యాంక్ ఏమిరిటీస్ ఛైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. సిఎస్.రావు పార్థివ దేహాన్ని గురువారం ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట విశాఖపట్నం కో - ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, సిఇఒ పివి.నరసింహమూర్తి, సిబ్బంది రెడ్డి శ్రీనివాస్, ఎర్రయ్య రెడ్డి ఉన్నారు.

నేడు జియోమార్ట్ క్రాఫ్ట్ మేళా ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలోని ప్రముఖ స్వదేశీ ఈ-మార్కెట్ ప్లేస్‌లలో ఒకటైన రిలయన్స్ రిటైల్ జియోమార్ట్ అతిపెద్ద హ్యాండ్లూమ్, హస్తకళల 'క్రాఫ్ట్ మేళా' నగరంలో శుక్రవారం ప్రారంభమవుతుందని జియో మార్ట్ సిఇఒ సందీప్ వరగంటి తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులను ప్రదర్శించడం ద్వారా చేనేత కార్మికులను శక్తివంతం చేయాలనే దృష్టితో ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కస్టమర్లు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ వెర్షన్‌ను సందర్శించడానికి అవకాశం ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవంలో ఒడిశా నుంచి సంబల్‌పురి చీరలు, కేరళ నుంచి కసావు చీరలు, జైపూర్ నుంచి బ్లాక్ ప్రింటెడ్ బెడ్‌షీట్లు, మధుబని పెయింటింగ్‌లు, ధోక్రా ఆర్ట్ వర్క్, జోధ్‌పూర్ నుంచి చెక్క గృహాలంకరణ, లక్నో నుంచి అందమైన చికంకారీ దుస్తులు లభిస్తాయన్నారు.

భారీ వృక్షాలను తొలగించొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రైల్వే స్టేషన్‌కు సమీపంలో జ్ఞానాపురం వైపు ఉన్న భారీ వృక్షాలను రైల్వే శాఖ తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాలను స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. వందలాది సంవత్సరాల నుంచీ ఉన్న టేకు, చింత, తాటి, కొబ్బరి వృక్షాలను తొలగించడం కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ సీనియర్ డివిజనల్ ఇంజనీర్ బహిరంగ వేలం ప్రకటన చేయడం పట్ల జ్ఞానాపురం వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పోర్టు కాలుష్య ప్రాంతంగా కొన్ని దశాబ్దాలుగా జ్ఞానాపురం ఉంది. కాలుష్యంతో ఈ ప్రాంతం వారు నిత్యం రోగాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కాలుష్య నివారణకు దోహదపడే భారీ వృక్షాలను రైల్వే శాఖ తొలగించడం భావ్యం కాదని అంటున్నారు. వృక్షాలను తొలగించకుండా రైల్వే శాఖ అభివృద్ధి పనులను చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన సామాజికవేత్త బివి.అప్పారావు తాజాగా ఓ ప్రకటన చేస్తూ భారీ వృక్షాలను తొలగించవద్దంటూ జ్ఞానాపురం ప్రాంతంలోని విద్యార్థులు, యువకులు చేస్తున్న పోరాటానికి అందరూ మద్దతు తెలిపాలన్నారు. ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరారు.

నేషనల్ సీనియర్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ అంపైర్‌గా శర్మ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : జమ్మూ కాశ్మీర్‌లో ఈ నెల 20 నుంచి 27 వరకు జరగబోయే నేషనల్ సీనియర్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు బ్లూ బ్యాడ్జి అంపైర్‌గా డివిఎస్‌వై శర్మను టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నియమించింది. ఇటీవల గోవాలో నిర్వహించిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్, కర్ణాటకలో జరిగిన నేషనల్ రిఫరీ కోర్స్‌లోనూ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శర్మను విశాఖపట్నం ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జి సుధాకర్‌బాబు, పర్సనల్ మేనేజర్ భగవాన్ ప్రసాద్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్. ఎల్ఐసి స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బోయవాల్మీకి, బెంతు ఒరియా జాతులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని అరకు ఎంపి గొడ్డేటి మాధవి, ఆదివాసి జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర తదితరులు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండను కోరారు. గురువారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందించారు.

గిరిజన వ్యతిరేక బడ్జెట్

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ గిరిజన వ్యతిరేకం బడ్జెట్ అని, జగన్ సర్కార్ గిరిజన ఉపప్రణాళికను విస్మరించిందని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పల నరస విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బడ్జెట్లో ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం మొత్తం బడ్జెట్లో ఆరు శాతం నిధులు కేటాయించాలన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్‌కు 6,929 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టారన్నారు. మొత్తం బడ్జెట్ లో ఇది 2.48 శాతం మాత్రమేనని గిరిజనులకు 6శాతం వాటాలో 16,740 కోట్లు ఎస్టీ సబ్ ప్లాన్ కు కేటాయించాల్సి ఉందన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిబంధనలను తుంగలో తొక్కి రాజ్యాంగ విలువలను ధిక్కరించారని విమర్శించారు. 2019 నుండి 2022 ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను నవరత్నాల పేరుతో దారి మళ్లించారన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT: GAJUWAKA
O.S. 182/2018
Between:
CANARA BANK (erstwhile Syndicate Bank) **Gajuwaka,** Rep. by its Branch Manager ...Plaintiff-Bank
And:
M/s. Queens Boutique, Rep. by its Prop: Yeddu Esther Rani, & 2 others ...Defendants
SUMMONS
To,
D-1: M/s. Queens Boutique, Rep. by its Prop: Yeddu Esther Rani, Christian, aged about 35 years, W/o. V Krupandhi, D.No.24-34-11, MIG-1, VUDA Colony, Chinagantyada, Vinayaka Nagar, Visakhapatnam-44
D-2: Smt. Yeddu Esther Rani, W/o. V. Krupandhi ,Prop: of M/s. Queens Boutique, Christian, aged about 35 years, Rest-do-
D-3: Palisety Sateesh Kumar, S/o. Satya Rao, Hindu, aged about 32 years, R/at MIG-II, Block No.15, Visweswaraya Nagar, Auto Nagar, BHPV Post, Gajuwaka, Visakhapatnam-26. .
Please take notice that the above named plaintiff-Bank has instituted the above suit against all of you for recovery of an amount of **Rs.2,17,064/-**and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **03-04-2023** for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **03-04-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.
K. DAKSHINA MURTHY (K.D.M), Advocate Visakhapatnam,
Cell : 98481 46393

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
I.P. 41/2022
Between:
Adapa Satyanarayana Murthy, S/o. Sri Rama Murthy, R/at D.No. 6-123/5/9/G, Flat No.101, Sai Surya Enclave-II, Sampath Nagar, Chandrampalem, Madhurawada, Visakhapatnam. ... Petitioner
And:
Smt.Agraharapu Savitri and 4 others ...Respondents
GENERAL NOTICE
It is brought to the notice of General Public that the petitioner has filed a petition before the Hon'ble Court against the respondents to adjudicate and declare him as an insolvent person. The Hon'ble Court was pleased to order general notice, so as to enable the general public to make objections, if any. Therefore, any person having any objection with regard to adjudication and declaration of the petitioner as an insolvent may approach the Hon'ble Court in person or through an Advocate on **24-03-2023** at **10.30 am** with their objections, if any, as otherwise the Hon'ble Court will proceed further in this matter as per law.
(By the Order of the Court)
T. PARTHA SARADHI
Advocate, Visakhapatnam
Cell: 9885787734

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 27 / 2022
బిట్వీన్:
గాలి పెద్దినాయుడు . . . వాది
Vs
గాలి స్వామినాయుడు వగైరాలు . . . ప్రతివాదులు
To
D-1: గాలి స్వామినాయుడు, తండ్రి పెద్దినాయుడు, నీలంపేట గ్రామం తురువోలు పోస్టు, చీడికాడ మండలం, అనకాపల్లి జిల్లా.
D-2: గాలి రమేష్ తండ్రి పెద్దినాయుడు,
- Rest do -
ఆర్డరు 5 రూ॥ 20 సి.పి.సి. ప్రకారం నోటీస్
పై నెంబరు దావా మీ Appearance నిమిత్తం **తే:4-4-2023దీకి** వాయిదా వేసి యున్నారు. సదరు తేదీన **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టులో మీరు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరయి మీ వాదనలు తెలియపర్చుకొనవలెను. లేనిచో మిమ్ములను పిలిచి, Exparte చేసి మీ పరోక్షమందు తీర్మానించబడును.
పొక్కునూరి నరసింహం
వాది తరపు అడ్వకేట్
నర్సీపట్నం-531116.
సెల్: 9440857567
నర్సీపట్నం
తే:16-3-23

గెడ్డపై అక్రమ నిర్మాణం

ఆసుపత్రి వెనుక మార్గంలో వంతెన ఏర్పాటుకు పనులు

ఒకసారి తొలగించినా మళ్లీ చేపట్టిన వైనం...

ప్రజాశక్తి - ఆరిలోవ : వెనుక మార్గం గుండా ఆసుపత్రిలోకి వాహనాలు ప్రవేశించేందుకు ఒక ప్రయివేటు ఆసుపత్రి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణానికి తెరతీసింది. స్థానికులు అభ్యంతరం చెప్పడంతో జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఆ నిర్మాణాన్ని అడ్డుకొని పాక్షికంగా తొలగించి వెళ్లిపోయారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ స్థానిక కార్పొరేటర్ ఓకే చెప్పడంతో ఆసుపత్రి యాజమాన్యం తిరిగి నిర్మాణాన్ని ప్రారంభించింది. వివరాల్లోకి వెళితే హెల్త్‌సిటీలో ఉన్న ఒక ప్రయివేటు ఆసుపత్రి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో పూర్తిగా నిర్మాణం చేపట్టింది. ప్రధాన మార్గం ద్వారానే తన కార్యకలాపాలు సాగిస్తుంది. ఆసుపత్రి వెనుక భాగంలో తమ హద్దులు ఉన్నంత వరకు నిర్మాణం చేపట్టి రక్షణ గోడ నిర్మించుకుంది. ఆసుపత్రి వెనుక భాగం నుంచి తమ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లు, తదితర వాహనాలు రాకపోకల కోసం ఆసుపత్రి వెనుక ఉన్న రక్షణ గోడను తొలగించి అటువైపు మార్గం కోసం ప్రభుత్వ స్థలాన్ని, గెడ్డను కప్పేసి బ్రిడ్జి నిర్మాణం చేపడుతోంది. ఇక్కడ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తే హెల్త్‌సిటీ ఉన్న ఇతర ఆసుపత్రుల యాజమాన్యాలు కూడా వెనుక భాగం నుంచి ద్వారాలు తెరిచే అవకాశాలున్నాయి. వెనుక భాగాన ఉన్న రహదారులు వాహనాలతో రద్దీ ఎక్కువ కావడంతో పాటు ఆసుపత్రి వ్యర్థాలు పూర్తిగా గెడ్డల్లో వేసే ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు, జివిఎంసి స్పందించి ఈ అక్రమాన్ని ఆపాలని స్థానికులు కోరుతున్నారు.

ఆసుపత్రి వెనుక గెడ్డను కప్పేసి బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్న ఆసుపత్రి యాజమాన్యం

తడి, పొడి చెత్త విభజనపై అవగాహన

సంగివలసలో తడి, పొడి, ప్రమాదకర చెత్త విభజనపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీ రాము

ప్రజాశక్తి -తగరపువలస : తడి, పొడి, ప్రమాదకర చెత్త విభజనపై జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలసలో మహిళలకు గురువారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అవగాహన కల్పించారు. ఇంటి ముంగిటకు వచ్చే క్లాప్ వాహనాలకు తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుసిడి ఎపిడి ఎల్.రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో పూడిక తొలగింపు

సంగివలస కాలనీలో పేరుకుపోయిన పూడికను పారిశుధ్య కార్మికులు గురువారం తొలగించారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ప్రత్యక్ష పర్యవేక్షణలో పూడిక తీత కార్యక్రమం జరిగింది.

గీతంలో ఫైజర్ ఆసియా పసిఫిక్ ఉపాధ్యక్షుడు

ప్రజాశక్తి-మధురవాడ : ప్రముఖ ఔషధ పరిశ్రమ ఫైజర్ ఆసియా పసిఫిక్ ఉపాధ్యక్షుడు ఆండ్రూ చాట్‌ఫీల్డ్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని గురువారం సందర్శించారు. గీతం విశ్వవిద్యాలయంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా ఫైజర్ అటానమస్ టీమ్ (పాట్) ఎంపికైన గ్రామీణ ప్రాంత బాలికలకు రసాయన శాస్త్ర విభాగం ప్రత్యేక కోర్సు నిర్వహిస్తోంది. శిక్షణ పొందుతున్న వారితో ఫైజర్ ఉపాధ్యక్షుడు ముఖాముఖి భేటీ అయ్యారు. గీతంలో లభిస్తున్న శిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ బాల్‌కుమార్‌మార్తి, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ బి.శ్రీనివాస్‌రావుతో సమావేశమయ్యారు. ఔషధ రంగంలో ఫైజర్‌తో సంయుక్త పరిశోధనలపై ఆసక్తితో ఉన్నట్టు వైస్ ఛాన్స్‌లర్ దయానంద సిద్ధవట్టం తెలియజేశారు. గీతంలోని వివిధ విభాగాలలో జరుగుతున్న పరిశోధన ప్రాజెక్టులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైజర్ విశాఖ సైట్ హెడ్ విక్రమ్ శుక్లా, ఇతర ఫైజర్ అధికారులు పాల్గొన్నారు.

రబీ సాగు ఆశాజనకం

మొక్కజొన్న సాధారణానికి మించి సాగు

అదే స్థాయిలో వరి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలో రబీ సీజన్‌లో వివిధ పంటల సాగు ఆశాజనకంగానే ముగిసిందని చెప్పవచ్చు. ఈ సీజన్‌లో ప్రధాన పంట మొక్క జొన్నగా పరిగణిస్తారు. ఈ పంట సాధారణ విస్తీర్ణం 385 ఎకరాలు కాగా, 487.50 ఎకరాల్లో సాగైంది. వరి పంట సాధారణ విస్తీర్ణం 315 ఎకరాలకు 310 ఎకరాల్లో సాగైంది. ఉలవలు 177 ఎకరాలకుగానూ 73 ఎకరాల్లోనూ, నువ్వులు 152 ఎకరాలకు గానూ 28 ఎకరాల్లోనూ, చో ళ్ల 72.50 ఎకరాలకు గానూ 52.5 ఎకరాల్లో సాగైంది. మొత్తంగా 1127.5 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గానూ 960 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. మొక్క జొన్న ప్రధానంగా దాకమర్రి, తాటితూరు, వరి పంట తాటితూరు, సింగనబంద గ్రామాల్లో అధికంగా సాగైంది.

పెరగనున్న పంటల దిగుబడి

రబీ సీజన్‌లో వివిధ పంటల సాగు విస్తీర్ణం ఆశాజనకంగా ఉంది. మొక్క జొన్న పంట ఎకరానికి25 నుంచి 28 క్వింటాళ్ల మేర దిగుబడి రానుంది. వరి పంట కూడా ఎకరానికి 24 నుంచి 28 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. గతేడాది ఇదే విధంగా పంట దిగుబడి వచ్చింది

బి.శివకామిని
మండల వ్యవసాయాధికారి,
భీమిలి

కెపాసిటర్ బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లో-ఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు కెపాసిటర్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇఇ రొంగలి రమేష్, డిఇఇ సకరయ్య, భీమిలి, చిట్టివలస ఎఇలు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్క నాటారు.

ధ్యాన సాధన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరానగర్‌లో ఉన్న ఆనంద మార్గ ఆశ్రమంలో జాతీయ సాధన శిబిరం గురువారం ప్రారంభమైంది. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ఆనంద్ మార్గ ఆచార్యులు, సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం సామూహిక ధ్యానం, నగర సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం సామూహిక ధ్యానం, భజన కార్యక్రమం, సహపంక్తి భోజన కార్యక్రమాలు జరిగాయి. ఈ శిబిరం ఆదివారం వరకు ఉంటుందని ఆనంద్ మార్గ విశాఖ యూనిట్ ఆచార్యులు సౌమ్యానంద అవధూత తెలిపారు. ఈ శిబిరంలో ఆనంద మార్గ సభ్యులతో పాటు ఇతరులు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా వసతి, ఆహారం అందిస్తామన్నారు. యోగాసనాలు, ధ్యానంపై శిక్షణ ఇస్తామని, ఆసక్తి ఉన్నవారు 9550775518 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఐఎఎస్ఇకి ఉన్నత్ భారత్ నిధులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఎఎస్ఇ)కి ఉన్నత్ భారత్ అభియాన్‌లో భాగంగా కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ రూ.50 వేలు సీడ్ ఫండ్‌ని అందించింది. దీనిని గురువారం ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి నుంచి ఐఎఎస్ఇ ప్రిన్సిపల్ ఆచార్య టి.శోభశ్రీ అందుకున్నారు. ఈ నిధులను ఐఎఎస్ఇ దత్తత తీసుకున్న గ్రామాలను అభివృద్ధి చేయడానికి వినియోగిస్తారు. కార్యక్రమంలో యుబిఎ సమన్వయకర్త పావని, ఐఎఎస్ఇ సమన్వయకర్త డాక్టర్ సోనీ హవీలా తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. గురువారం ఉదయం అగనంపూడి నుంచి లంకెలపాలెం వైపు వెళ్లే రహదారిలో ఓ లారీ మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంది. అదే దారిలో వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఆగి ఉన్న లారీని తప్పించుకొని వెళుతున్న క్రమంలో వెనకనుంచి వచ్చిన టిప్పర్ బలంగా ఢీకొట్టింది. ఇద్దరు యువకుల తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న దువ్వాడ ట్రాఫిక్ సిఐ ఉమామహేశ్వరరావు, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వాహన రిజిస్ట్రేషన్ శ్రీకాకుళం జిల్లాకు చెందినదిగా ఉందని, బండి నెంబర్ ఆధారంగా మృతుల వివరాలు కనుక్కుంటున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతుల అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -కంచరపాలెం : ఇద్దరు యువతులు అదృశ్యంపై కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో గురువారం వేర్వేరుగా ఫిర్యాదులు నమోదయ్యాయి. ఘటనలకు సంబంధించి కంచరపాలెం పోలీసుల కథనం ప్రకారం... అమలాపురం అల్లవరం ప్రాంతానికి చెందిన యువతి ఎన్.సత్యనాగదుర్గ (17) జ్ఞానపురంలోని బాబాయ్ వీర వెంకట సత్యనారాయణ ఇంటికి నెల రోజుల క్రితం వచ్చింది. ఈ నెల 13వ తేదీన బయటకి వెళ్లిన యువతి ఇంటికి చేరుకోక పోవడంతో ఆమె బాబాయ్ వీర వెంకట సత్యనారాయణ కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ దివ్యభారతి దర్యాప్తు చేపట్టారు.

మరో కేసులో జీవీఎంసీ 49వ వార్డు పరిధి సింగరాయమెట్ట ప్రాంతానికి చెందిన అప్పిని మేఘన (21) బుధవారం ఉదయం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆమె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. బుధవారం కాలేజీకి వెళ్లిన యువతి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లేకపోవటంతో ఆమె తల్లి అప్పిని మంజుల గురువారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం సిఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎఎస్ఐ రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చి కుక్క కరిచి ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -ములగాడ : జీవీఎంసీ 61వ వార్డు పరిధి మల్కాపురం బజార్ వీధుల్లో ఓ పిచ్చికుక్క ముగ్గురిని గాయపరిచింది. ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ కొణతాల సుధకు యువకులు తెలియజేశారు. కార్పొరేటర్ సుధ వెంటనే పశువైద్యులతో మాట్లాడారు. వెటర్నరీ డాక్టరు సిబ్బంది సహాయంతో ఆ కుక్కను పట్టుకున్నారు. ఈ ప్రాంతంలో మూడు రోజులు పాటు డ్రైవ్ నిర్వహిస్తామని వెటర్నరీ డాక్టర్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని కెజిహెచ్‌కు తరలించారు.

సాంకేతిక యువజనోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఇటిఇ) సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐస్పేర్ ఆర్-2023 గురువారం ప్రారంభమైంది. ప్రముఖ ఐటి సంస్థ క్యాప్ జెమిని వివిఎల్ఎస్ఐ ఇంజినీరింగ్ విభాగం ఉపాధ్యక్షుడు పులమరశెట్టి మురళీ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సమకాలీన సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు పలు ఇంజినీరింగ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. నూతన సాంకేతిక అంశాలపై వర్క్‌షాప్‌లతో పాటు నిపుణుల ప్రసంగాలు, క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కో-ఆర్డినేటర్లు తెలిపారు.

గీతంలో 'జెమ్-23'

ప్రజాశక్తి-మధురవాడ : వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న గీతం ఎక్సెలెన్స్ మీట్-23 (జెమ్)ను సీనియర్ ప్రొఫెసర్ కె.అశోక్ గురువారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. 30 సంవత్సరాలుగా "జెమ్"ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తూ వస్తున్నామని, ఎందరో విద్యార్థుల ప్రతిభకు వేదికగా జెమ్ నిలిచిందని చెప్పారు. కార్యక్రమ సిఇఇ, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ, జెమ్-23లో భాగంగా గీతం ప్రీమియర్ లీగ్ పేరిట క్రికెట్ పోటీలను, వాలీబాల్, త్రోబాల్, బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవంలో వాణిజ్య అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'విశాఖ ఉక్కు' పోరాటం ఉధృతం

ప్రజాశక్తి-సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం, మూసేస్తాం అంటూ కేంద్ర ప్రభుత్వం మొండిగా ప్రకటనలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ పంథాను మార్చి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నిర్ణయించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు 100శాతం కట్టుబడి ఉన్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణపై గురువారం పౌర గ్రంథాలయంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించడంతోపాటు కేంద్ర ప్రభుత్వం చేసిన శతశాతం వాటాల విక్రయ నిర్ణయాన్ని కూడా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర పార్లమెంట్ సభ్యులకు, కేంద్ర స్టీల్ కన్సల్టేషన్ కమిటీ సభ్యులకు కమిటీ తరపున లేఖలు రాశామని చెప్పారు. మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటన చేసింది మొదలు 760 రోజులుగా కార్మికులు, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నా, పార్లమెంట్ సభ్యులు పార్లమెంటులో మోడీ సర్కార్‌ను నిలదీస్తున్నా, అమ్మేస్తాం , మూసేస్తాం అంటూ మొండిగా ప్రకటనలు చేస్తుండటంపై తమ కమిటీ ఆగ్రహం వ్యక్తంచేస్తోందన్నారు. పంథాను మార్చి ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ కో-కన్వీనర్లు నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, మస్తానప్ప, రమణారెడ్డి, వరసాల శ్రీనివాసరావు, పడాల రమణ, జె.రామకృష్ణ, దొమ్మేటి అప్పారావు పాల్గొన్నారు.

సంఘీభావం ప్రదర్శిస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ఘనంగా కెవి.మహదేవన్ జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అమ్మాజమ్మ సూర్య ప్రకాశరావు మెమోరియల్స్ సంయుక్త ఆధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో స్వరబ్రహ్మ కెవి.మహదేవన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవి.మహదేవన్ స్వర పరచిన చిత్ర గీతాలతో సంగీత విభావరి ఏర్పాటుచేశారు. సింగర్ రాజు, రమణి పాడిన తలకు నీళ్ళోసుకొని, మహ్మద్ ఖాన్, గీత పాడిన పగటి కలలు కంటున్న, మధు, లయ పాడిన సరిగమ స్వర, బొమ్మిడి సత్యనారాయణ, లిఖిత పాడిన చెంగూ చెంగూ ముద్దాడంగా, పెమ్మరాజు రామ్, సీపీ రాజేశ్వరి పాడిన నువ్వు నేను ఏకమైనాము, రామకృష్ణ, జాస్మిన్ పాడిన వయసే ఒక పూల తోట, అమ్మాజీరావు, నాగలక్ష్మి పాడిన బుగ్గ గిల్లగానే సరిపోయిందా, భయ్యా శ్రీనివాస్, రామిని పాడిన సుప్రభాత సుందరి నీవు, సుధీర్, శైలజ పాడిన రాయిని ఆడది చేసిన, ఋషి, మహేష్ పాడిన తెల్లవారనీకు ఈరేయిని వంటి ప్రజాదరణ పొందిన గీతాలు శ్రోతల ప్రశంసలు పొందాయి.

శివఅప్పలరాజుకు సత్కారం

ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర గాయకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జామి శివ అప్పలరాజును అతిథులు స్వర కళా పురస్కారంతో అతిథులు సత్కరించారు. అనంతరం ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీధర్ మాట్లాడుతూ, కళాకారుల అభ్యున్నతి కోసం జామి శివఅప్పలరాజు నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. కళాకారుల కోసం జీవిత బీమా, హెల్త్ కార్డులను అప్పలరాజు చేయించారని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కళాకారులకు చేయూతనిస్తున్నారన్నారు. నిస్వార్థంగా ఎందరో కళాకారులకు సేవ చేస్తున్న అప్పలరాజుకు గుర్తింపుగా ఆత్మీయ సత్కారం అందజేయడం హర్షణీయమన్నారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ, సంగీతానికి ఎల్లలు లేవని నిరూపించిన గొప్ప సంగీత సృష్టికర్త కెవి.మహదేవన్ అన్నారు.

సంగీత విభావరిలో కీ బోర్డ్‌పై సోమేష్, తబలాలపై శివ, అప్పలరాజు, పాడ్స్‌పై బాబ్జీ, కాంగోపై మెలోడీ సత్యనారాయణ పాటకు తగ్గ వాయిద్య సహకారం అందించారు. వ్యాఖ్యాతగా టి.రాధారాణి వ్యవహరించారు. కార్యక్రమంలో కళా రంగ ప్రతినిధులు ఎస్.ఫణిస్వామి, వి.ఎం.గోపాలరావు, పి.శ్యామ్‌సుందర్, పీలా నీలతిలక్, ఎంటిఆర్ త్రినాథ్, జెఎంఆర్ నెహ్రూ పాల్గొన్నారు.

దాసరి రాజు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్నఎమ్మెల్యే అదీప్‌రాజు

దాసరి రాజుకు అదీప్‌రాజ్ నివాళి

ప్రజాశక్తి-వేపగుంట : గుండెపోటుతో మృతిచెందిన జివిఎంసి 93వ వార్డు వైసిపి అధ్యక్షుడు దాసరి రాజుకు వైసిపి నాయకులు నివాళులర్పించారు. దాసరి రాజు మరణవార్త విని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు విజయవాడ నుంచి విశాఖ బయలుదేరి వచ్చారు. అత్యంత ఆప్తుడు, సోదర సమానులంటూ దాసరి రాజు పార్థివదేహం వద్ద ఎమ్మెల్యే కన్నీటి పర్యంతమయ్యారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మొదటి నుంచి తనతో ప్రయాణం చేసిన దాసరి రాజు ఇంకా లేరన్న వార్త జీర్ణించుకోలేక పోతున్నానని ఆవేదన వ్యక్తంచేశారు. దాసరి రాజు లేని లోటు పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీర్చలేనిది అని పేర్కొన్నారు.

అమ్మవారి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -ములగాడ : జీవీఎంసీ 40వ వార్డు ఎకెసి కాలనీ గ్రామ దేవత శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఇంత వరకు హుండీలో ఉన్న ఆదాయాన్ని లెక్కించారు. సంవత్సరకాల ఆదాయం రూ.66,530 వచ్చిందని వార్డు కార్పొరేటర్ గుండప్ప నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఆదాయాన్ని అమ్మవారి ఆలయానికి ఉపయోగించనున్నట్లు ఆయన చెప్పారు.

ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న కార్పొరేటర్ గుండప్ప నాగేశ్వరరావు తదితరులు

తవ్వేసి వదిలేశారు...

పాతగాజువాక జంక్షన్‌లో దుమ్ము ధూళితో ఉన్న రహదారి

పాత గాజువాకలో దుమ్ము ధూళి

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాక జంక్షన్ దుమ్ము ధూళితో నిండిపోతోంది. ఈ జంక్షన్ విస్తరణ పేరుతో 20 రోజుల క్రితం డివైడర్లను తొలగించారు. తొలగింపు పనులను రెండు రోజుల్లో పూర్తిచేశారు. అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులు ప్రారంభించకపోవడంతో తవ్విన రోడ్లపై ఉన్న దుమ్ము, ధూళి ఎగిరి ప్రయాణికులపై పడుతోంది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థులకు సంబంధించిన వాహనాలతో దుమ్ము మరింత ఎక్కువగా వ్యాపిస్తోంది. ఎగిరిన దుమ్ము కారణంగా చుట్టుపక్కల రోడ్లపైన టిఫిన్ చేసే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా సాయంత్రం వేసిన గాలికి మరింత దుమ్ము ఎగురుతోంది. ఒకప్పుడు ట్రాఫిక్‌కు భయపడిన ప్రజలు ఇప్పుడు దుమ్ము, ధూళితో భయపడుతున్నారు. పనులు ప్రారంభించుకుంటే తాత్కాలికంగా వాటర్ ట్యాంక్‌తోనైనా రోడ్డు తడిపితే ఉపశమనం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

'స్టీల్' అధికారులకు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అభినందనలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఇటీవల సేఫ్టీ విభాగానికి సిజిఎంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఎస్‌వి.కృష్ణయ్య, పిపిఎం అండ్ మైన్స్ సిజిఎం అజయ్ కుమార్ షోబ్టీ, ఇఎస్ అండ్ ఎఫ్ డికె బాధ్యతలు తీసుకున్న దుర్గాప్రసాద్‌ను ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు. సంబంధిత విభాగంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన అధికారులు మాట్లాడుతూ, తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ, కోశాధికారి కెవి.రత్నం, దాసరి పుల్లారావు, మోహన్‌బాబు, పైడి కొండలరావు, చింతా మోహన్, కొప్పుల పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అధికారులను సత్కరిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రతినిధులు

జి బ్లాక్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ జి బ్లాక్‌లో జరుగుతున్న ఆర్‌సిపి కాలువ పనులను ఐలా సెక్రటరీ సిహెచ్ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు వాసవి మాజీ ట్రెజరర్ రమేష్ కుమార్ ఉన్నారు.

'జనసేన సభ విజయవంతంతో వైసిపికి గుబులు'

ప్రజాశక్తి-సీతమ్మధార : మచిలీపట్నంలో ఈ నెల 14న జరిగిన జనసేన సభ విజయవంతం కావడంతో వైసిపి నేతల్లో గుబులు పట్టుకుందని ఆ పార్టీ పిఎసి సభ్యులు కోన తాతారావు పేర్కొన్నారు. పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, పేర్నినాని, కారుమూరి నాగేశ్వరరావు జనసేన సభకు వచ్చిన ప్రజాదరణ చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. జనసేనకు దిశ, దశ లేదని వారు కామెంట్ చేస్తున్నారని, వైసిపికే అవి లేవన్నారు. వైసిపి దృష్టిలో దిశ అంటే దోచుకోవడం, దశ అంటే ఆక్రమించుకోవడం అర్థం అని ఆరోపించారు. అవినీతి రహిత పాలనను ఇవ్వడమే దిశ అని, ప్రజల ఆలోచనల కనుగుణంగా వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే జనసేన దశ అని చెప్పారు. 2024లో జనసేన అధికారంలోకి వస్తుందని, పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రిగా పదవి చేపడతారని జోస్యం చెప్పారు. దానికి భయపడి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. పవన్ కల్యాణ్‌ను విమర్శించే హక్కు, అర్హత వైసిపి మంత్రులకు లేదన్నారు. మంత్రులు నాని, నాగేశ్వరరావు విజ్ఞతతో మాట్లాడడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఇసుక మాఫియా నడుపుతూ 600 ఎకరాలు ఆక్రమించుకున్న మంత్రులా మాట్లాడేది అని ప్రశ్నించారు. జనసేన చోడవరం ఇన్‌ఛార్జి పివిఎస్.రాజు మాట్లాడుతూ, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ జోకర్‌లా తయారయ్యాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలోవిశాఖ ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి- ములగాడ : కాంట్రాక్టర్ మజ్జి కైలాస్ తన తండ్రి కీర్తిశేషులు సోమన్నపాత్ర జ్ఞాపకార్థంగా గురువారం మల్కాపురం పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మజ్జి కైలాస్ మాట్లాడుతూ, ప్రతివారమూ పెద్దింటి అమ్మవారు ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైపిల్లి ప్రసాద్, మజ్జి సొంనాథ్, భోగవిల్లి గాంధీ, ముదిలి రామకృష్ణ, పిల్లా శారద, బంక సంతోష్, డాన్ సూరిబాబు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి-చోడవరం

ప్రపంచంలో ప్రముఖ మేధావులు, శాస్త్రజ్ఞుల్లో పలువురు వికలాంగత్వం కలిగి ఉన్నవారేనని, వికలాంగ పిల్లల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించగలిగితే అద్భుతాలు సృష్టిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకట లక్ష్మమ్మ అన్నారు. గురువారం చోడవరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన వికలాంగుల ఉపకరణ వైద్య నిర్ధారణ శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ప్రథమ గురువు తల్లి మాత్రమేనని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ వికలాంగుల అభివృద్ధిలో కీలకపాత్ర వహించాల్సింది తల్లిదండ్రులేనని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత మాట్లాడుతూ వికలాంగ బాలబాలికలను ప్రతిరోజు పాఠశాలకు పంపించినట్లయితే వారు సమాజంలో భాగస్వామ్యం కావడం సులభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త వసంత, ప్రత్యేక ఉపాధ్యాయులు అప్పలరాజు, మహాలక్ష్మి నాయుడు, దేవుడు బాబు, వర ప్రసాదు, రిసోర్స్ ఉపాధ్యాయులు జగన్నాథం నాయుడు, పోలిరాజు, దేముడు నాయుడు, కెవిఎం నాయుడు, వివిధ మండలాల నుంచి తల్లిదండ్రులు, వికలాంగబాలబాలికలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డిఇఒ

అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ గురువారం చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమం, బైజూస్ ట్యాబ్‌లో వినియోగం, మన బడి నాడు నేడు కార్యక్రమం అమలును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని పరిశీలించారు. విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగం పెంచమని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి చదివి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పాఠ్యాంశాలపై ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయుల వద్ద వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నాల్గవ తరగతిని సందర్శించి, తరగతిలో అమలు జరుగుతున్న టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ అమలును, గ్రేడింగ్‌లను పరిశీలించారు. విద్యార్థుల జ్ఞానం, అవగాహనను పరిశీలించడానికి పలుకు ప్రశ్నలు వేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు డి.వసంత మరియు సిఆర్‌పి కెవియమ్.నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ వెంకట లక్ష్మమ్మ

నీట్‌లో హర్షప్రియకు 1300 ర్యాంకు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన కొయిలాడ హర్ష ప్రియ నీట్‌లో ఆల్ ఇండియా ర్యాంక్ 1300 సాధించింది. ఆమె ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు రమణబాబు, వైసిపి మండల యువజన అధ్యక్షుడు శరగడం జగ్గారావు, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో అంకెల గారడీతో మాయ

ప్రజాశక్తి- కె.కోటపాడు : వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి వచ్చే ఆదాయం, ఖర్చులు ఎంత? చేసిన అప్పులు ఎంత? అనే విషయాలేమీ స్పష్టం చేయకుండా బడ్జెట్‌లో అంకెల గారడీతో మోసం చేస్తుందని టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు విమర్శించారు. ఏపీ ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పైలా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న అనేక పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదన్నారు. వాస్తవాలు అడిగితే తెలుగుదేశం సభ్యుల్ని సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు.

అనకాపల్లి : రాష్ట్ర బడ్జెట్ కొత్త సీసాలో పాత సారాల ఉందని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వర్ రావు విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో పరిశ్రమలు పెట్టినట్టుగాని, ఉపాధి కల్పించినట్టుగానీ లేదన్నారు. నవరత్నాల పేరుతో అమలు చేస్తున్న సంక్షేమాలు, నగదు బదిలీ పథకాలు లెక్కల్లోనే ప్రసంగం నిండిపోయిందన్నారు. కార్మికుల వేతనాలు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ వంటి అంశాలే లేవన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి కలగానే మిగిలిందన్నారు.

చెరువు అభివృద్ధి పనులపై తెలుసుకుంటున్న డిపిఒ శిరీషరాణి

చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - కశింకోట

చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శిరిషరాణి ఆదేశించారు. మండలంలోని ఉగ్గినపాలెంలో చెరువు అభివృద్ధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు గర్భంలో ఎంత నీరు చేరుతుందో తెలుసుకున్నారు. గట్లు పటిష్టంగా ఉండాలని సూచించారు. అనంతరం తాళ్ళపాలెం చెరువు, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిపి కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ నాయుడు, ఎమ్‌పిడిఓ కొంకి అప్పారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

మందులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ శ్యామసుందర్

పిహెచ్‌సిలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీవో ఎస్డి శ్యామసుందర్ గురువారం పరిశీలించారు. ఆసుపత్రిలో టీకాలకు సంబంధించిన ఇంజక్షన్లను ఏ విధంగా భద్రపరుస్తున్నారో తనిఖీ చేశారు. రక్తహీనత, పౌష్టికాహారం లోపంతో ఎంతమంది బాధపడుతున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఓ శాఖను మండల పరిధిలో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఫలితాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై రాజకీయపక్షాలతో, పాటు సాధారణ ప్రజల సైతం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. గురువారం ఉదయం నుండి మండలంలోని పలు గ్రామాలలో బెట్టింగులు ప్రారంభమయ్యాయి. అధికారంలో ఉన్న వైసిపి గెలుస్తుందని ఆ పార్టీ అభిమానులు, ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని టిడిపి నాయకులు భావిస్తున్నారు. రాత్రి 9 గంటల వరకు క్యూలైన్లో నిలబడి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఓటర్లను వ్యతిరేకత క్యూలైన్లో నిలబెట్టిందని తెలుగుదేశం పార్టీ వారు ధీమాగా ఉన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజాసంఘాల మద్దతుతో పిడిఎఫ్ ఎలాగైనా విజయం సాధిస్తుందని కొంతమంది లక్షల్లో బెట్టింగులు కాస్తున్నారు. గురువారం రాత్రి బుచ్చయ్యపేట, రాజాం, వడ్డాది తదితర గ్రామాలలో రాజకీయ పక్షాల నాయకులు సాధారణ ప్రజలు సైతం గుంపులుగా ఏర్పడి ఎన్నికల ప్రక్రియను ఫోన్లలో ఆరా తీశారు.

20న చలో విజయవాడను జయప్రదం చేయండి

ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి

ప్రజాశక్తి-చోడవరం

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మెయిన్ స్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్మికులందరూ చలో కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్.బుచ్చిరాజమ్మ, జి.లక్ష్మి, బి.చింతల్లి, ఏ,ఈశ్వరమ్మ, జి,రామలక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మిడ్డేమీల్స్ కార్మికులు

పాడి రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని పాడి రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు స్థానిక పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఉషాకుమారి తెలిపారు. 2100 కిలోల కాకిజొన్న గడ్డి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. 5కిలోల ప్యాకెట్ ధర 460 రూపాయలు కాగా 75 శాతం రాయితీ పై115రూపాయలు రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కావాల్సిన రైతులు సమీపంలోగల రైతు భరోసా కేంద్రంలోగాని, పశు వైద్యశాలలో గాని ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్ తీసుకెళ్లి పొందవచ్చునని తెలిపారు.

18న సాంబమూర్తి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండల కేంద్రం మునగపాకలో వెలసి ఉన్న సాంబమూర్తి స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు ఈ నె ల18వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న శనివారం ఉదయం నుండి అభిషేకాలు, సర్వదర్శనాలు జరపడంతో పాటుగా మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్న సమారాధన జరుగుతుందని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు ఉత్సవమూర్తుల ఊరేగింపు, కళ్యాణ మహోత్సవం గ్రామ పెద్దల సహకారంతో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఆయా కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి కలగా లక్ష్మి

వైఎస్ఆర్ ఆసరాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట

స్వయం సహాయక సంఘాలకు అందించే మూడువ విడత వైఎస్ఆర్ ఆసరా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్‌పిపి కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో గడపగడపకు ఆసరా కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ఎపిఓ ఎమ్ శ్రీనివాసరావు, సర్పంచ్ కలగా గున్నయ నాయుడు పాల్గొన్నారు. రామన్న పాలెం గ్రామంలో గ్రామ ఐక్య సంఘం సభ్యులు ముచ్చు లక్ష్మి, వియ్యపు గౌరీ, వెదురు పర్తి గ్రామంలో విఓఏ సత్యశ్రీ ప్రచారం చేశారు.

19న హరిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి అచ్యుతాపురం : సత్య సాయి సేవ భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మండలంలోని హరిపాలెం గ్రామ పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు భజన మండలి నిర్వాహకులు కర్రి ఆది నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఎ.సుధీర్, డాక్టర్ సందీప్ తదితరులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. క్యాన్సర్, మహిళా గర్భసంచి సమస్యలు తదితర వాటిపై మహిళలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే విధి మండలం సీలేరులో పరీక్ష కేంద్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహణకు భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశారు. తొలిరోజున బుధవారం ఇంటర్ ఫస్టియర్ పరీక్షల్లో పెట్లు ప్రవీణ్ అనే విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ వెబ్ కెమెరా ద్వారా చిక్కి డిబారైన నేపథ్యంలోఉన్నతాధికారులు సీలేరు ఇంటర్ పరీక్ష కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించిచారు. ఆర్.కామరాజును సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్ సాయిరాం, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ కెవి .రత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టి ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చర్యలు పటిష్టం చేశారు. స్థానిక ఎస్ఐ రామకృష్ణ పరీక్ష కేంద్రాన్ని వద్ద విస్తృత తనిఖీలు చేపట్టారు.

సమావేశంలో పాల్గొన్న వ్యవసాయదారుల సంఘం నాయకులు

సమగ్రంగా భూ సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లిలో భూములకు సమగ్రంగా భూ రీ సర్వే నిర్వహించి భూమి హక్కు పత్రాలను రైతులకు ఇవ్వాలని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం నాయకులు జిల్లా అధికారులను కోరారు. స్థానిక వివి రమణ రైతు భారతిలో గురువారం జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు విల్లూరి రాము, భీశెట్టి కృష్ణ అప్పారావు మాట్లాడుతూ పంట కాలువలు, ప్రభుత్వ భూములు, జీవీఎంసీ స్థలాలను ఆక్రమించి చేసిన నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో ప్రస్తుతం భూమిలో ఉన్న వారి పేర్లను నమోదు చేయాలని, ఎస్ఎఫ్ఐ రికార్డు ప్రకారం గ్రౌండ్ సర్వే నిర్వహించి వివాదాలకు తావు లేకుండా, రైతుల కోర్టులకు వెళ్లే పరిస్థితి లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో కాండ్రేగుల అప్పారావు, కెవి సూర్యనారాయణ, మల్ల రామకృష్ణ, కర్రి మోది నాయుడు, కొణతాల శ్రీనివాసరావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పాదయాత్ర

ప్రజాశక్తి -కశింకోట

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం హాత్ సే హాత్ జోడో అభయాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోట ప్రధాన రహదారిలో బజారు ప్రాంతంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాత్ సే హాత్ జోడో సమన్వయ కమిటీ సభ్యులు మలపురెడ్డి కోటేశ్వరరావు రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంట గ్యాస్ రూ.500కు అందిస్తామన్నారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజన హామీలు కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూరా శ్రీనివాస్, బోయిన భానుమూర్తి యాదవ్, ఆర్ఆర్ నాయుడు, సూరిశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు.

తిరిగి వచ్చిన కంటి రోగులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 102వ ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న 33 మంది కంటి రోగులు గురువారం వారి స్వగ్రామాలకు తిరిగి వచ్చారు. బ్రాండిక్స్ ఆవరణలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 33 మందికి క్యాట్రాక్ట్ కంటి శుక్లముల తొలగింపు ఆపరేషన్ చేయాలని శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య నిపుణులు సిఫార్సు చేశారు. ఈ మేరకు బ్రాండిక్స్ సమకూర్చిన బస్సులలో విశాఖకు తీసుకెళ్లి అక్కడ ఆపరేషన్లు చేయించి మరల బ్రాండిక్స్ బస్సులపై తిరిగి వచ్చారు.

ఆపరేషన్ అనంతరం బస్సులో వస్తున్న కంటి రోగులు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

నివాళులర్పిస్తున్న మేయర్, జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-యంత్రాంగం

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలు చోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు.

ఎంవిపి.కాలనీ : ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణదీక్ష చేపట్టి, ప్రాణత్యాగం చేసిన మహా పురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కొనియాడారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి కమిషనర్ పి.రాజాబాబుతో కలసి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై శ్రీనివాసరావు, డాక్టర్ వి సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ సి వాసుదేవరెడ్డి, సెక్రటరి పి నల్లనయ్య, హార్టికల్చర్ డిడి ఎం.దామోదరరావు, రెవెన్యూ డిసి ఎంవిడి.ఫణిరాం పాల్గొన్నారు.

కలెక్టరేట్ : ఆర్టిసి కాంప్లెక్స్ సమీపంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జివిఎంసి డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి త్యాగనిరతిని కొనియాడారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధనకు అమరజీవి కృషి అజరామరమని, నేడు తెలుగువారిగా గుర్తింపు పొందుతున్నామంటే ఆయన త్యాగాలే ప్రధాన కారణమన్నారు.

పద్మనాభం : మండలంలోని గంధవరం గ్రామానికి చెందిన వాసవి క్లబ్ ఆధ్వర్యాన జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని వాసవి క్లబ్ సహకారంతో 500 లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకును, సీలింగ్ ఫ్యాన్‌ను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు సిహెచ్ వెంకటరమణ, ఎ.శ్రీనివాసరావు, కెవి.బంగారుచిట్టి, పి.గుప్తాజీ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక బీచ్‌లో ఉన్న జివిఎంసి పొట్టి శ్రీరాములు పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి టిడిపి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మూడో వార్డు ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్రకుమార్, నాయకులు కె.నాగరాజు, కె.అప్పలనాయుడు, జి.పోలిరాజు, ఎస్.జోగారావు పాల్గొన్నారు.

భీమిలి మండలం సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట ఎంపి యుపి పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి హెచ్ఎం వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు నాగమణి, సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు

విశాఖపట్నం : ఏయూ విద్యా విభాగంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఉక్కునగరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి సేవాదళ్ నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయనను స్మరించు కోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ నేతలు బెల్లాల పెంటబాబు, కడిమిసెట్టి వీర్రాజు, దాసరి సొంబాబు, సిహెచ్.రవికుమార్, కృష్ణమోహన్, మధుసూదన్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు .

ఉక్కునగరంలోని కేండిల్ జంక్షన్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైఎస్ఆర్‌టియుసి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తితో విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు చిత్తశుద్ధితో కార్మికులు పోరాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, జనరల్ సెక్రెటరీ దాసరి పుల్లారావు, గొందేసి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి ఘటిస్తున్న డిఆర్ఒ వెంకటరమణ తదితరులు

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడు పొట్టి శ్రీరాములు : డిఆర్ఒ

అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంతో పాటు భాష ప్రయుక్త రాష్ట్రాలకు పొట్టి శ్రీరాములు ఆద్యుడని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ కొనియాడారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం పొట్టి శ్రీరాములు 123వ జయంతి కార్యక్రమం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక మెయిన్ రోడ్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహకులు పిరాట్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులు అర్పించారు. స్థానిక రామచంద్ర థియేటర్ జంక్షన్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, నాయకులు గైపూరి రాజు, కాండ్రేగుల శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు. ఇక్కడే సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై బంగారు రాజు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పాదచారులకు మిఠాయిలు బిస్కెట్లు పంపిణీ చేశారు. సత్యనారాయణపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు గండేపల్లి తులసి లక్ష్మి ఆధ్వర్యంలో, ఏఎంఏఎల్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ గల్లా జయ బాబు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. స్కూల్ కమిటీ చైర్మన్ వెంకట్రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

చోడవరం : చోడవరం వాసవి మెయిన్ క్లబ్, వనితా క్లబ్, కపుల్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య చిన్న సత్రంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. క్లబ్ ప్రతినిధులు కలగర్ల శేషగిరిరావు వెంకట మధు, పివి. రమణమూర్తి, ఆర్యవైశ్య సంఘ భవనం చైర్మన్ కొల్లూరు మంగరాజు, కిరాణావర్తక సంఘం ప్రెసిడెంట్ పసుమర్తి వెంకట్ పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డి పి ఈశ్వరరావు, మూలపేట గ్రామ సర్పంచ్ బీ శెట్టి గంగప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంఇఒ యస్.అప్పలరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ చిన్నమ్మాయి, ఉపాధ్యాయులు పి. రాధాకుమారి, పివి.భాస్కర రావు, జి.శ్రీరామమూర్తి, జి. గురునాథరావు, సిహెచ్.కుమార్ ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పివి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం డిఎన్‌బి.కుమారి తదితరులు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి.ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్బవరంలో...

చోడవరంలో...

నక్కపల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు సందర్భంగా ఇంచార్జి హెచ్ఎం ఎన్.అప్పారావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబూజీ, చౌదరి, సుందర్రావు, విశ్వనాథ్, పీడీ కుందూరు రాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోటలో శ్రీ వాసవి, వనితా క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలోనూ, టి.అర్జాపురంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ అహ్మద్, ఎస్ఐ విభూషణరావు, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్య దేవ్, శీలం శంకరరావు, గుమ్ముడు దొరబాబు, క్లబ్ అధ్యక్ష కార్య దర్శిలు కె.రమేష్, నరేంద్ర, అశోక్, హారిక, లావణ్య నివాళులు అర్పించారు.

నర్సీపట్నం టౌన్ : వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పాల్ఘాట్ సెంటర్లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలోని బాలికలకు టూత్ బ్రష్‌లు, మిఠాయిలను పంచారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యనిర్వాహక సభ్యులు వెలగా నారాయణరావు, ఆయుష్మాన్ వాసవి క్లబ్ అధ్యక్షుడు కుసుమంచి వెంకటకృష్ణ పాల్గొన్నారు. స్థానిక శాఖ గ్రంథలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ధమయంతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెయిన్ పాఠశాల ఉపాద్యాయులు నారాయణరావు మాట్లాడారు.

గొలుగొండ : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాల యాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజిబివి విద్యార్థినిలు పాల్గొన్నారు.

మునగపాకలో...

ఇపిడిసిఎల్‌లో...

కలెక్టరేట్ : ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో సంస్థ హెచ్ఆర్‌డి చీఫ్ జనరల్ మేనేజర్ ఎ.రవికుమార్ అధ్యర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సంస్థ డైరెక్టర్లు బి.రమేశ్ ప్రసాద్, డి.చంద్రం, ఎవివి సూర్యప్రతాప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు డి. సుమన్ కల్యాణి, జె. శ్రీనివాసరావు, ఎం.రవీంద్ర పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎపిఇపిడిసిఎల్ అధికారులు

ప్రజాశక్తి
శుక్రవారం 17 మార్చి 2023

నర్సీపట్నంలో రోడ్డు విస్తరణకు ర్యాలీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :ప్రభుత్వ నిర్ణయం ప్రకారం రోడ్డు 120 అడుగులకు విస్తరింప చేయాలని నర్సీపట్నం పట్టణ అభివృద్ధి కమిటీ, వైసిపి నాయకులు నర్సీపట్నంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అబీద్ సెంటర్ నుంచి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందించారు. శ్రీ కన్య కూడలి వద్ద మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. నర్సీపట్నం పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయ పనుల నిమిత్తం వస్తున్న ప్రజల సౌకర్యార్థం పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని రోడ్డు విస్తరణ చేపట్టాలని తెలిపారు. నర్సీపట్నం ప్రధాన రోడ్డు అబిడ్స్ సెంటర్ నుండి పెద్దబొడ్డేపల్లి పెద్ద మదుం వరకు రోడ్డును 120 అడుగుల వరకు విస్తరింపజేస్తే రానున్న కాలంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగి పోతాయని తెలిపారు. గొలుగొండ మండలం ఎంపిపి గజ్జల మణికుమారి మాట్లాడుతూ, రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వెంకటగిరి బాబు, మండల వైఎస్ఆర్ పార్టీ ప్రెసిడెంట్ లెక్కల సత్యనారాయణ, గృహ సారథి కన్వీనర్ పాణి శాంతారావు, మండల వైయస్సార్ పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తి రమణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న వైసిపి నాయకులు

వ్యాపారులకు నష్టం లేకుండా చూడాలి
సిపిఎం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో జనాభా పెరుగు దలకు అనుగుణంగా మెయిన్ రోడ్డు విస్తరణ పనులు 120 అడుగులు చేపట్టాలని, ముందుగా బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.సత్తిబాబు విలేకరులతో మాట్లాడుతూ, వర్షాకాలంలో డ్రైనేజీలో నీరు రోడ్డుపైకి పొంగి పొర్లుతుందని తెలిపారు. రోడ్డు విస్తరణలో నష్టం పోతున్న భవన యజమానులకు, వ్యాపారస్తులకు అందిస్తున్న టిడిఆర్ బాండ్లు మాత్రమే కాకుండా చట్టం ప్రకారం అందాల్సిన నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు. చిరు వ్యాపారులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి : సిపిఐ

నర్సీపట్నంలో 120 అడుగుల రోడ్డు విస్తరణ చేయడం మంచిదేనని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతం నలుమూల నుండి నర్సీపట్నం పట్టణ ప్రాంతానికి ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో ట్రాఫిక్ తో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.సిసి రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు పూర్తి చేసి రోడ్డు విస్తరణ చేయాలన్నారు. షాపు, భవన యాజమాన్యాలకు తక్షణమే నష్ట పరిహారం ఇస్తూ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, నర్సీపట్నం పట్టణ కార్యదర్శి జి.గురుబాబు, ఏఐవైఎఫ్ నాయకులు జి. రాధాకృష్ణ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి -రావికమతం:మండలంలోని కవగుంట గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ రైతులకు ఎంతో మేలును కలిగిస్తుందని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకొని సాగుకు సిద్ధం కావాలని సూచించారు. దీంతో, మంచి ఆరోగ్యంతో పాటు పంట అధిక దిగుబడిని సాధించు కోవచ్చునన్నారు. రసాయనక ఎరువులు, పురుగుల మందులు వాడటంతో ప్రజల జీవన ప్రమాణం తగ్గి పోవడమే కాకుండా అనేక అనారోగ్యాలకు గురి అవుతున్నామన్నారు. క్లస్టర్ ఇంచార్జ్ ఎర్రంశెట్టి నిర్మల మాట్లాడుతూ, ఘనజీవామృతం పంటకు కావలసిన అన్ని సూక్ష్మ, స్థూల పోషకాలు ను ఇస్తుందని తెలిపారు.

దుస్తులు ధరించిన విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

క్రీడా దుస్తులు అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చోద్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డాక్టర్ పాల్ రాజ్ ఇంజనీరింగ్ కాలేజ్ యాజమాన్యంతో కలిసి నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఇటీవల జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో సెలెక్ట్ అయిన సందర్భంగా విద్యార్థులకు అభినందించారు. నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 32 మంది విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వరలక్ష్మి, సెక్రటరీ జకారియా, కరస్పాండెంట్ రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యచంద్ర

పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :పవన్ కళ్యాణ్ పై ఎమ్మెల్యే ధర్మశ్రీ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని జనసేన నియోజకవర్గం సమన్వయకర్త రాజాన వీర సూర్యచంద్ర తెలిపారు. చోడవరం నియోజకవర్గ ప్రజల దృష్టిలో ధర్మశ్రీ ఎప్పుడో ఫ్లవర్ అయ్యారని విమర్శించారు. గురువారం నర్సీపట్నంలో జనసేన నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడాతూ,చోడవరం నియోజకవర్గంలో రోడ్లు మరమ్మత్తులు చేయించలేని ధర్మశ్రీ పవన్ కళ్యాణ్ ను విమర్శించే అర్హత, స్థాయి లేదన్నారు. మంత్రి పదవి ఇవ్వలేదని మూడు రోజులు గుక్క పెట్టిన మీరా మా అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను విమర్శించేది అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొప్పాక కల్యాణి, వేగిశెట్టి శ్రీను, మారిశెట్టి. రాజా, బల్లా అశోక్, దొరబాబు, నాగు, కొత్తకోట రామశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా గరగల ఊరేగింపు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో లింగంపేట గ్రామంలో కొత్త అమావాస్య సందర్భంగా జరిగే నూకాంబికా ఉత్సవాల సందర్భంగా జరిగే గరగల ఊరేగింపు గురువారం నిర్వహించారు. గ్రామంలో భక్తులంతా గర్భగుడి వద్ద అమ్మవారి ప్రతిరూపాలైన గరగలకు తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా గొలుగొండ వెళ్లారు. ఈ గరగలు ఐదు రోజుల పాటు సమీపంలో ఉన్న గ్రామాల్లో ఊరేగిస్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోకల సంతోష్‌కుమార్, ఆలయ పూజారి గొలకొండ త్రిమూర్తులు, నూకాంబికా ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్లు గొలకొండ లింగయ్య, నెల్లూరు అప్పారావు గొంతిన ప్రసాదు, చేట్రోలు మల్లేశ్వరరావు, గొలకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

గరగల ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

-యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి

-మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రోలుగుంట:స్థానిక ఎంపిపి పాఠశాల వద్ద గురువారం మండల యుటిఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి హాజరై మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరంతరం ప్రతిఘటిస్తుందని తెలిపారు. అనంతరం రోలుగుంట మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా సహాధ్యక్షులు పి.గాయిత్రి వ్యవహరించారు. రోలుగుంట మండల యుటిఎఫ్ కమిటీ గౌరవ అధ్యక్షులుగా యు.నాగభూషణం, అధ్యక్షులుగా కాళింగ సతీష్, సహాధ్యక్షులుగా సిహెచ్ మణిసూర్యకుమార్, బి.భారతి, ప్రధాన కార్యదర్శిగా కె.కేశవరావు, కోశాధికారిగా ఎంఎస్ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి, కార్యదర్శిగా సరోజిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తదనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. మండలంలో ఉన్న ఉపాధ్యాయుల హక్కులకు, సమస్యల పరిష్కారంకు యుటిఎఫ్ కృషి చేస్తుందని తెలిపారు.

కాళింగ సతీష్

కె.కేశవరావు

బాధితురాలికి సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:దిశా ఫౌండేషన్ సభ్యురాలు ఇటంశెట్టి లక్ష్మికి అండగా ఉంటామని దిశ ఫౌండేషన్ సభ్యులు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కొణతాల వరలక్ష్మి మాట్లాడుతూ, లక్ష్మి తన భర్తను ఇటీవల కోల్పోవడంతో ప్రభుత్వం నుండి పెన్షన్ వచ్చే వరకు అవసరమైన నిత్యావసర సరకులను టీం సభ్యులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొయిలాడ శ్రావణి, శేషు కుమారి, కాంతమ్మ, పల్లా సత్యవతి, చిటికెల రవణమ్మ, లక్ష్మి, ఈసంశెట్టి మహేశ్వరి పాల్గొన్నారు.

సరుకులు ఇస్తున్న ఫౌండేషన్ సభ్యులు

విద్యార్థినులతో వైద్యాధికారి

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక డిగ్రీ కళాశాల, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిశుభ్రత, పీరియడ్స్ పై అవగాహన కల్పించారు. విశ్వ ఆయుర్వేదిక్ పరిషత్ గైనకాలజిస్ట్ బాల మాట్లాడుతూ నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆడపిల్లలు బలమైన ఆహారాన్ని తీసుకోవాలని, మానసిక ప్రశాంతతకు యోగా, ధ్యానం, మెడిటేషన్ చేయాలన్నారు. విద్యార్థినిలకు మెమొంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.లావణ్య, పి.సన్యాసినాయుడు, సిహెచ్ శివ, ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

మారిన వాతావరణం

రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి -కోటవురట్ల:గడిచిన రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ప్రధానంగా జీడి, మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జీడి మామిడి తోటలో పూత పిందెతో ఉండటంతో వర్షాలు అధికమైతే ప్రధానంగా పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉండటంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. ఇటీవల కాలంలోనే మామిడి తోటలకు వ్యయ ప్రయాసలు కోర్చి అధిక పెట్టుబడితో క్రిమిసంహారక మందులు పిచికారి చేశారు. వర్షాలు అధికమైతే పూత పిందె దెబ్బ తినడంతో పాటు పిచికారి చేసిన మందులు కూడా పూర్తిగా వృధా అవుతాయని రైతులు తెలిపారు.

మబ్బులు కమ్మిన ఆకాశం

భూముల రీ సర్వేపై అభ్యంతరాలు తెలపాలి

-జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

ప్రజాశక్తి -రావికమతం: భూ రీ సర్వే పట్ల ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. గుమ్మలపాడు గ్రామంలో గురువారం పర్యటించిన ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ, పూర్తిస్థాయిలో 100 శాతం రీ సర్వే చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలో 141 గ్రామాల్లో భూ సర్వే ప్రారంభించినప్పటికీ కొన్ని గ్రామాల్లో మాత్రమే 100శాతం భూ సర్వే పూర్తి అయిందన్నారు. రెండవ విడతగా 247 గ్రామాల్లో భూ సర్వే ప్రారంభించామని తెలిపారు. మార్చిలో 100శాతం పూర్తయిన గ్రామాల భూముల వివరాలు ఆన్లైన్లో పొందుపరుస్తామని తెలిపారు. రెవెన్యూ సమస్యలు, అభ్యంతరాలు ఉంటే నేరుగా జిల్లా కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో తెలియజేయాలని కోరారు. అంగన్వాడి కేంద్రంలో మెనూ పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలో పిల్లలకు తయారు చేసే వంటశాల పరిశుభ్రంగా ఉంచుకొని, మెనూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

అధికారులతో మాట్లాడుతున్న జెసి

బడ్జెట్‌లో వ్యవసాయానికి నిధులు ఏవీ?

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాధ్‌రెడ్డి అసెంబ్లీలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రవేశ పెట్టిన బడ్జెట్లో వ్యవసాయ రంగానికి అవసరమైన స్థాయిలో కేటాయింపులు లేవని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు ప్రకటనలో పేర్కొన్నారు. పైగా గత బడ్జెట్ కంటే రూ. 2 వేల కోట్లు వ్యవసాయశాఖకు కేటాయింపులు తగ్గించారన్నారు. రాష్ట్రంలో 62 శాతం మంది ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారని, బడ్జెట్ కేటాయింపులు అందుకు తగిన ప్రాధాన్యత ఇవ్వ లేదన్నారు.గ్రామీణాభివృద్ధికి గతంలో రూ. 17,109 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్లో రూ.15,873 కోట్లకు తగ్గించారని తెలిపారు. వ్యవసాయరంగంలో కీలకమైన ఇరిగేషన్‌కు కేటాయింపులలో పెరుగుదల లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కనీసంగా బడ్జెట్లో 15 శాతం నిధులు పెంచలేదన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు బడ్జెట్ లో తగిన కేటాయింపులు లేవన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించిన లీటరు పాలకి రూ. 4 లు ప్రోత్సాహం ఇవ్వలేదన్నారు.

మాట్లాడుతున్న డైరెక్టర్

త్వరలో వెబ్ సిరీస్

ప్రజాశక్తి-మాడుగుల: స్థానిక నటీ నటులకు అవకాశం కల్పించే విధంగా త్వరలో వెబ్ సిరీస్ ప్రారంభిస్తామని బుల్లితెర అసోసియేట్ డైరెక్టర్ ప్రబల సాయి కుమార్(సాయి తేజ) తెలిపారు. ఇటీవల కాలంలో బిగ్ బాస్ షో తోపాటు, జాక్ పాట్, కబడ్డీ(జెమిని)నంబర్ వన్ యారి విత్ రానాతో పాటు వివిధ షోలకు అసోసియేట్ దర్శకుడుగా ఆయన మంచి గుర్తింపు పొందారు. మాడుగులకు చెందిన జబర్దస్త్ నటులు ప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన వివరాలు తెలిపారు. వెబ్ సిరీస్ నిర్మాణం కోసం కథలు సిద్ధం చేశామని, స్థానిక నటులకు సైతం అవకాశం కల్పిస్తామని, ఇందుకోసం త్వరలో సెలక్షన్స్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఒక సినిమా సైతం చిత్రీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

వరి కుప్ప దగ్ధం

- రూ.50 వేల నష్టం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పాతమల్లంపేట పంచాయతీ శివారు కొత్తపాలెం సమీపంలో ప్రమాద వశాత్తు వరి కుప్ప దగ్ధమైంది. దీంతో ఆ రైతుకు సుమారు రూ.50 వేల నష్టం సంభవించింది. కొత్తపాలెం గ్రామానికి చెందిన కూరాకుల అచ్చిబాబుకు చెందిన వరి కుప్ప నుండి గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న రైతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ ధాన్యం కాలిపోయాయి. సంవత్సరం అంతా కష్టపడి పండించిన పంట మంటల పాలైందని రైతు అచ్చిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపారు.

మంటలను ఆర్పుతున్న రైతులు

ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి

ప్రజాశక్తి -మాకవరపాలెం: గ్రామ పంచాయతీ ల్లో ఇంటి పన్నుల వసూళ్ల పై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి సూచించారు. గురువారం మండలంలోని పైడిపాల, తాడపాల పంచాయతీలో ఇంటి పనులు వసూళ్ళు, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, పారిశుధ్యం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ, ఈ నెల చివరి నాటికి 100 శాతం ఇంటి పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీల్లో మురుగునీటి కాలువలు పరిశుభ్రం గా ఉండేవిధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి సీతామలక్ష్మి, కార్యదర్శులు హైమావతి, అప్పలాచారి పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ

విద్యార్థితో ఉపాధ్యాయుడు

సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-గొలుగొండ: జిల్లా సైన్స్ ఫెయిర్‌కు బాలయోగి గురుకుల పాఠశాలకు చెందిన అల్లు విద్యార్థి గిరిబాబు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ విద్యార్థి ఆటోమేటిక్ ఎస్ఎంఎస్ హెచ్చరికతో షేషంట్ మోనిటరింగ్ అనే ప్రాజెక్టును తయారు చేశాడు. ఈ ప్రాజెక్టు జిల్లా సైన్స్ ఫేర్‌కు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు సుధాకర్, మురళీకృష్ణ విద్యార్థిని అభినందించారు.

ఆలయానికి నగదు వితరణ

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని శంకరం పంచాయతీ పరిధిలో మరిడిమాంబ తీర్థ మహోత్సవానికి హాజరై గురువారం టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు ఐదు వేల విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కురప బాలరాజు, గంగు నాయుడు పాల్గొన్నారు.మాడుగుల మరిడిమాంబ ఉత్సవానికి గాను రూ.12 వేల రూపాయల విరాళం అందజేశారు



గ్రామస్తులతో పైలా ప్రసాదరావు

కోడిగుడ్లను పరిశీలిస్తున్న ఎంఇఒ

స్టాక్ పాయింట్‌లో తనిఖీలు

ప్రజాశక్తి -యస్.రాయవరం: కొరుప్రోలు గ్రామంలో స్టాక్ పాయింట్ వద్ద విద్యార్థులకు అందించే కోడిగుడ్లను మండల విద్యాశాఖాధికారి ఏయస్ఏఎన్ మూర్తి గురువారం పరిశీలించారు. గుడ్ల పరిమాణం, బరువు తూకం వేసి పరిశీలించారు. నిల్వ వున్న, చితికిన గుడ్లు సరఫరా కాకుండా చూసుకోవాలని, సమయానికి సరఫరా చేయాలని డీలర్ నూకరాజుకు సూచించారు.

24న సంతల ఆశీలు వేలం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని బుచ్చింపేట, రోలుగుంట వారపు సంతల ఆశీళ్ల వేలం పాటలు ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.ప్రభాకరరావు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఆశీల వసూలుకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. రోలుగుంట వారపు సంతకు రూ.25వేలు, బుచ్చంపేట వారపు సంతకు రూ.15వేలు ధరావత్తు సొమ్మును డిడి రూపంలో చెల్లించాలన్నారు. రూ.50వేల సాల్వెన్స్ ధృవపత్రం సమర్పించి ఈ పాటలో పాల్గొనాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నూతన విధానాలు పాటిస్తే ఆక్వా కల్చర్‌లో అధిక లాభాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపెడ ఆధ్వర్యంలో గురువారం ఆక్వా కల్చర్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడి లక్ష్మణరావు మాట్లాడుతూ, ఆక్వా కల్చర్ సాగులో నూతన విధానాలు పాటించి, సాంకేతిక పద్ధతులు వినియోగిస్తే నాణ్యమైన దిగుబడులు వచ్చి లాభాలు వస్తాయన్నారు. నిషేధిత యాంటీబయోటిక్స్ వినియోగించద్దని సూచించారు. అనుమతులు లేకుండా చెరువులు సాగు చేస్తున్న వారికి, కొత్తగా సాగు చేసే వారికి ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా రెగ్యులర్ చేస్తున్నామన్నారు. చెరువుల్లో విభిన్న జాతుల సాగు పై దృష్టి పెట్టారని తెలిపారు.

ఎంపెడ ఏడి ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ, ఎగుమతుల కారణంగా ఖర్చు పెరిగిందని రైతులు సాగులో ఖర్చులు తగ్గించే పద్ధతులు పాటించాలన్నారు. ఆక్వా కల్చర్ రైతులు తమ సమస్యలను అధికారులకు వివరించారు. ఆక్వా కల్చర్ రైతులకు విద్యుత్తు రాయితీలు ఇతర సహకారం అందించాలని కోరారు. ఇప్పటికే ఆక్వా రైతులంతా నష్టపోయి ఉన్నారని, సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జిల్లా అధ్యక్షులు మాతా గురునాథరావు, ఎంపీడీవో సీతారామరాజు, అధికారులు విజయ్‌కృష్ణ, ఆనంద్ కుమార్, సంతోషి రూప తదితరులు పాల్గొన్నారు.

హాజరైన అధికారులు

నేడు వైద్యశిబిరం

ప్రజాశక్తి-యస్.రాయవరం: ధర్మవరం-అగ్రహారం గ్రామంలో శ్రీ తులసీ కళ్యాణ మండపం వద్ద ఈ నెల 17న సాగరదుర్గ, సింహాద్రి, పుష్పగిరి" కంటి హాస్పిటల్స్ సంయుక్తంగా మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పౌండర్ సియ్యాదుల అచ్యుత్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ, ఈ వైద్యశిబిరంలో బి.పి, షుగర్ టెస్టులు చేసి అన్ని రకాల వ్యాధులకు నిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చే వారు పాత రిపోర్ట్స్ తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకోవడానికి తప్పనిసరిగా ఆధార్ కార్డ్, ఆరోగ్య శ్రీ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్ తీసుకు రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.